నగరానికి నవరాత్రి శోభ


శ్రీకృష్ణునిగా సత్యదేవుడు


గడ్డిబజారు శివాలయంలో లలితాదేవి అలంకారం


నడివీధి గంగమ్మ ఆలయంలో పార్వతీమాతగా..


భావనారుషి ఆలయంలో గాయత్రీదేవిగా..

కడప కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల శోభతో కడప నగరం కళకళలాడుతోంది. సాయంత్రం 6 గంటల నుంచి ఆలయ సమీపంలోని వీధులన్నీ మహిళా భక్తులతో కళకళలాడాయి. 'కరుణించు తల్లీ కనకదుర్గమ్మా.. మా ఇలవేల్పు నీవేనమ్మా.. మా ఇడుములు నీవే తీర్చాలమ్మా.. అంటూ భక్తులు అమ్మవారిని మనసారా ప్రార్థించారు. కడప నగరంలోని అమ్మవారి ఆలయాలన్నీ భక్తుల సందడితో కనిపించాయి.

కడప నగరంలో దసరా ఉత్సవాల శోభ కొనసాగుతోంది. సోమవారం భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దేవుని కడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శేష వాహనంపై స్వామిని కొలువుదీర్చారు. కడప అమ్మవారిశాలలో రాజరాజేశ్వరీగా అమ్మవారికి అలంకారం చేశారు. విజయదుర్గాదేవి ఆలయంలో బ్రహ్మచారిణిగా అలంకరించడంతో పాటు ఇరువైపుల శివ పార్వతులు, దుర్గామాతల మూర్తులను ఏర్పాటు చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నగర శివార్లలోని శ్రీ లలితాంబికదేవి ఆలయంలో అమ్మవారిని బాల త్రిపురసుందరిగా అలంకరించారు. శ్రీ భద్రావతి భావనారుషి ఆలయంలో అమ్మవారిని అందంగా తీర్చిదిద్దిన వేదికపై గాయత్రిదేవి అలంకారం చేశారు. శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో బాల త్రిపురసుందరీదేవి అలంకారం చేశారు. గడ్డిబజారులోని సత్యదేవునికి శ్రీకృష్ణునిగా అలంకారం చేశారు. శ్రీ కామకోటి కళాంబ దేవి ఆలయంలో అమ్మవారికి శ్రీ లలితాదేవిగా, ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీదేవిని శ్రీరాజరాజేశ్వరిగా అలంకరించారు. చిన్నబెస్తవీధిలోని బాల పోలేరమ్మ, హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శ్రీ పార్వతీదేవి అలంకారం చేశారు. నబీకోటలోని శ్రీ రామలింగచౌడేశ్వరీదేవి తోపాటు ఇతర ఆలయాల్లో అమ్మవారికి విశేష అలంకారాలు నిర్వహించారు.


బాల త్రిపురసుందరిగా శ్రీ లలితాంబ


శేష వాహనంపై కడప రాయుడు


శ్రీ పార్వతీదేవిగా బాల పోలేరమ్మ


శ్రీ రాజరాజేశ్వరిగా వాసవాంబ


బ్రహ్మచారిణిగా శ్రీ విజయదుర్గాదేవి


లలితాంబికను దర్శించుకుంటున్న భక్తజనం


లలితాంబిక ఆలయంలో కోలాట కోలాహలం

క్లుప్తంగా

వ్యవసాయానికి విద్యుత్ కోతలు లేకుండా చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వ్యవసాయానికి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సోమవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కరువు పీడిత ప్రాంతాలైన రాయలసీమ కేంద్ర కడప జిల్లాలో అత్యధిక వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉన్నాయని అన్నారు. కావున పగటిపూట 9 గంటల విద్యుత్ అందించాలని పేర్కొన్నారు.

19న నిరాహార దీక్ష



మాట్లాడుతున్న లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 19న కడప యూటీఎఫ్ కార్యాలయంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. సోమవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్ అహ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు చెన్నకేశవులు, కిరణ్ బాబు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ హాకీ పోటీలకు ఎంపిక


సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాపాఠశాల విద్యార్థులు

కడప స్పోర్ట్స్ : తమిళనాడు రాజధాని చెన్నైలో ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న 1వ హాకీ ఇండియా సబ్‌జూనియర్ మెన్ అండ్ ఉమెన్ సౌత్‌జోన్ చాంపియన్‌షిప్–23కు కడప వైఎస్ఆర్ క్రీడా పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జి.చందు, ఎం.శ్రీనివాస్, ఎస్.మహమ్మద్, డి.దేవసాయియాదవ్, పి.బాలాజీలు ఎంపికయ్యారు. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు గూడూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వారు చక్కటి ప్రదర్శన కనబరచడంతో సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారు. వారికి ఆ పాఠశాల ప్రత్యేకాధికారి కె.జగన్నాథరెడ్డి, కోచ్ అనిల్ అభినందనలు తెలిపారు.

పట్టుచీరల పంపిణీ


మహిళా నేతలకు పట్టుచీరలు పంపిణీ చేస్తున్న మాసీమబాబు

కడప కార్పొరేషన్ : దసరా పండుగను పురస్కరించుకుని టీటీడీ బోర్డు సభ్యుడు ఆర్.వెంకట సుబ్బారెడ్డి (మాసీమబాబు) ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేతలకు పట్టు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అక్కచెల్లెమ్మలైన మహిళలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వారికి పండుగ సందర్భంగా ఒక సోదరుడిగా దుస్తులు అందజేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జైద్ జన్మదిన వేడుకలు


జైద్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్ బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ నాయకులు సయీద్ జైద్ జన్మదిన వేడుకలు కడపలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మట్టి పెద్దపులి ప్రాంతంలో నిర్వహించిన వేడుకల్లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పాల్గొని, ఆయనచే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకుడిగా సేవా కార్యక్రమాల్లో మరింత ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు అవార్డు

కడప ఎడ్యుకేషన్ : న్యూఢిల్లీలో నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ ఏలియన్స్ వారు దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు ఇంటర్నేషనల్, పబ్లిక్, బడ్జెట్ ప్రయివేటు పాఠశాలలు అనే క్యాటగిరీల వారీగా ఎడ్యుకేషన్ వరల్డ్ అవార్డును ప్రకటించారు. ఈ క్రమంలో కడప నగరంలోని బాలవికాస్ హైస్కూల్‌కు బడ్జెట్ ప్రయివేటు పాఠశాలల విభాగంలో అవార్డు దక్కింది. దీనిపై ఆ పాఠశాల డైరెక్టర్ గంగయ్య, కరస్పాండెంట్ సుబ్బారాయుడు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

ఎన్ని పార్టీలు ఏకమైనా విజయం వైఎస్ఆర్‌సీపీదే


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : ఎన్ని పార్టీలు ఏకమైనా రాబోయే ఎన్నికల్లో విజయం వైఎస్ఆర్‌సీపీదేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం మారుతి నగర్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పటి నుంచో టీడీపీ, జనసేన కలిసే ఉన్నాయని, చంద్రబాబు అరెస్టుతో అది ఇంకా బలపడి వారి మధ్య పొత్తుకు దారి తీసిందన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని ఆయా పార్టీ నేతలు చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. ఆ మూడు పార్టీలు ఇప్పుడే కొత్తగా కలవలేదని, 2014 ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయని గుర్తుచేశారు. దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలను అణచివేయడమే ఆ పార్టీల విధానమన్నారు. అందరూ కలిసి వచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు నిలవలేరన్నారు. స్కిల్స్ స్కామ్‌లో అవినీతికి పాల్పడి చంద్రబాబు అరెస్ట్ అయితే, దానిపై టీడీపీ నాయకులు ఆందోళన చేయడం సరికాదన్నారు. ఆ స్కామ్‌లో చంద్రబాబు ఆధారాలతో సహా దొరికిపోయారని, అందుకే కోర్టు ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. న్యాయస్థానంలో చంద్రబాబు నిజాయితీని నిరూపించుకోవాలి తప్ప ప్రభుత్వంపై బురదజల్లేలా దుష్ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు వాస్తవాలు గుర్తించాలని కోరారు. 2024 ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన పార్టీలు కనుమరుగు కాక తప్పదని హెచ్చరించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కేఎంసీ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ అన్నారు. సోమవారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా పుట్లంపల్లి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, వినాయక నగర్ ప్రాంతాలను ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. పుట్లంపల్లిలో కంపోస్ట్ ఎరువు తయారు చేసేటువంటి తొట్ల కొలతలను పరిశీలించి, వాటిని పలు మార్పులు చేయాలన్నారు. అక్కడి నుంచి వచ్చు మురికి నీరు కోసం డ్రైనేజీ పనులను ప్రారంభించవలసినదిగా అధికారులకు ఆదేశించారు. గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో మొక్కలను నాటించే విధంగా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ విభాగ అధికారులకు ఆదేశించారు.

'స్పందన'లో అర్జీల స్వీకరణ

కడప నగరపాలక సంస్థ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆ అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఎస్ఈ రత్నాల రాజు, ఈఈలు నారాయణస్వామి, కరిముల్లాఖాన్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మా కాలనీపై 'కృప' చూపండి

కడప కల్చరల్ : బడుగులైన నిరుపేదలు నివసిస్తున్న 48వ డివిజన్‌లోని తమ కాలనీపై కృప చూపాలని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్ నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయిప్రవీణ్ చంద్‌ను కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన పాస్టర్ మహేష్ నగర పరిధిలోని బుడగజంగాల కాలనీకి వెనుక గల కృపా కాలనీలో గతంలో పైనుంచి వచ్చే డ్రైనేజీ మురికి నీటి కుంటలతో నిండి ఉండేదని, స్థానికులతో కలిసి తాను ఆ కుంటలను పూడ్చుకున్నామన్నారు. కార్యక్రమంలో సిస్టర్ శాంతమ్మ, రవితేజ పాల్గొన్నారు.

వైవీయూను సందర్శించిన బాబుమోహన్


బాబుమోహన్‌ను సత్కరిస్తున్న వీసీ, అధికారులు

వైవీయూ : ప్రముఖ సినీనటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. హైదరాబాద్ నుంచి కడపకు చేరుకున్న ఆయన్ను వైవీయూ పూర్వ విద్యార్థి, బీజేవైఎం జాతీయ నాయకుడు పణతల సురేష్ విశ్వవిద్యాలయానికి తీసుకువచ్చారు. అనంతపురానికి సినిమా షూటింగ్ నిమిత్తం వెళుతూ మార్గంమధ్యలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, అధికారులు జ్ఞాపిక, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య నాగరాజు, డీన్‌లు, లలిత కళల విభాగాధిపతి కోట మృత్యుంజయరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

యోగివేమన విశ్వవిద్యాలయం ఉద్యోగి పసుపులేటి చంద్రకిశోర్ కుటుంబాన్ని ఆదుకుంటామని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం వైవీయూ పరిపాలన భవనం వద్ద చంద్రకిశోర్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి బోధన, బోధనేతర సిబ్బంది నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య డి.విజయరాఘవప్రసాద్, పరీక్షల నియంత్రణాధికారి ఎన్.ఈశ్వరరెడ్డి, ఆర్ట్స్ విభాగం డీన్ తప్పెట రామప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీకి నామినేషన్ల దాఖలు


నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి నలుగురు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఎస్వీ రమణారెడ్డికి వారు నామినేషన్ పత్రాలు సమర్పించారు. 7వ డివిజన్ కార్పొరేటర్ మల్లీశ్వరి, 20వ డివిజన్ కార్పొరేటర్ వై.మాధవి, 33వ డివిజన్ కార్పొరేటర్ షేక్ గౌస్ జబీన్, 50వ డివిజన్ కార్పొరేటర్ కట్టమీద అరుణప్రభలు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎం.సుబ్బారెడ్డి, మల్లికార్జున, కె.సూర్యనారాయణరావు, షంషీర్, డివిజన్ ఇన్‌చార్జిలు శ్రీరంజన్‌రెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై నిఘా


జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా సోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలు, రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టే వారిపై సైబర్‌సెల్, సోషల్ మీడియా విభాగం ద్వారా నిఘా ఉంచామన్నారు. సదరు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవాస్తవ ప్రచారాన్ని ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దని ఎస్పీ సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి లేదా ఫార్వర్డ్ చేసే వారిపై నిఘా ఉంచామన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్, షేర్ చేసే వారిపై గ్రూప్ అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికుల ఆందోళన


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా వ్యాప్తంగా వివిధ పంచాయతీలలో పని చేస్తున్న తమ పెండింగ్ వేతనాలు తక్షణం విడుదల చేయాలని స్వచ్ఛ భారత్ కార్మికులు కడప కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో ఇక్కడ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో స్వచ్ఛభారత్ మిషన్‌లో పని చేస్తున్న జగనన్న క్లాప్ మిత్రలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 680 ప్రకారం కనీస వేతనం రూ.10,000 ఇచ్చి కార్మికుల భద్రత కల్పించే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా, జిల్లా కార్యదర్శి హనుమంతు, జిల్లా కార్యదర్శి లింగన్న, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, అశోక్, ఉపాధ్యక్షులు ఇమ్మానియేల్, ఆనందయ్య, నాయకులు సుధాకర, ఓబులేసు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : కడపలోని పవన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన జెన్ షిటోర్యూ కరాటే స్కూల్ వారు నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో 40 మంది విద్యార్థులు వైట్ బెల్ట్ నుంచి ఆరెంజ్ –2 బెల్ట్‌కు ప్రమోట్ అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పవన్ స్కూల్ కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి హాజరై వైట్ బెల్ట్ నుంచి ఆరెంజ్ –2 బెల్ట్‌కు, బ్రౌన్–2 నుంచి బ్రౌన్–1కి ప్రమోటైన విద్యార్థులకు బెల్ట్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేసి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా స్పోర్ట్స్ కరాటే ప్రెసిడెంట్ విజయ్, సెక్రటరీ నరేంద్ర, ఏపీ కరాటే అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాషా అన్నారు. సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 29వ డివిజన్‌లోని సీకే స్ట్రీట్, చాంద్‌పీర్ గుంబజ్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి.. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా షేక్ కరిమున్నీసా అనే మహిళ మాట్లాడుతూ తన కుటుంబానికి జగనన్న ప్రభుత్వంలో రూ.9.27 లక్షలు లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. షేక్ రేష్మా అనే అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, జగనన్న అమ్మ ఒడి పథకాల ద్వారా తమ కుటుంబానికి రూ.10 లక్షల మేలు జరిగిందని తెలిపింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపింది. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, 29వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ రిజ్వాన్, ఇన్‌చార్జి డిష్ జిలాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, రామమోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, బంగారు నాగయ్య పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం పేదలకు గొప్ప వరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి.అంజద్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలో రవీంద్రభారతి స్కూల్ వెనుక ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' 10వ క్యాంపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 11 రకాల వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. తాను స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆ తర్వాత రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, భాస్కర్‌వర్మ, మౌలాలి, మనోజ్, కిరణ్, షఫీ పాల్గొన్నారు.

ప్రవక్త స్ఫూర్తితో మానవతను చాటుదాం


మాట్లాడుతున్న హజరత్ మౌలాన సయ్యద్‌షా హుసేనీ ఖాస్మి సాహెబ్

కడప కల్చరల్ : సర్వమానవాళిని శాంతి పథంలో నడిపిన మహా ప్రవక్త మహమ్మద్ స్ఫూర్తితో అందరం మానవతను చాటుకుందామని అస్తానె హుసేనియా పీఠాధిపతి, రోషన్ మున్వర్ మసీదు ఇమాం హజరత్ మౌలాన సయ్యద్‌షా హుసేనీ ఖాస్మి సాహెబ్ అన్నారు. కడప నగరం జిల్లా కోర్టు ఎదురుగా గల రోషన్ మున్వర్ మసీదులో సోమవారం జల్సాయే సీరతున్నబీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రైల్వేకోడూరుకు చెందిన మత గురువు హజరత్ మౌలాన ముఫ్తీ మహమ్మద్ అఫ్తాబ్ ఖాస్మి సాహెబ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రవక్త జీవితం ప్రపంచానికి ఆదర్శనీయమన్నారు. పీఠాధిపతితో కలిసి ఆయన ప్రవక్త జీవిత విశేషాల గురించి వివరించారు. పలు ఆధ్యాత్మిక అంశాలను తెలియజేశారు. ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు షంషీర్‌ఖాన్, సర్దార్ హుసేన్, మాబు షరీఫ్, హాజీ రహమతుల్లా,ఖలీల్‌సాహెబ్, మౌల్వీలు, ముఫ్తీలు, ముస్లింలు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని సాకారం చేసుకోవాలి


మాట్లాడుతున్న ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శంకర్

కడప స్పోర్ట్స్ : యువత జీవితానికి సంబంధించి లక్ష్యం నిర్దేశించుకుని సాకారం చేసుకోవాలని రాజంపేట కోర్టు ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.శంకర్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని ఎస్.వి. ఇంజినీరింగ్ కళాశాలలో స్టెప్ ఆధ్వర్యంలో 'వ్యక్తిత్వ వికాసం–కెరీర్ గైడెన్స్' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటించడం ద్వారా లక్ష్యం సాధిస్తారని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వీరసుదర్శన్‌రెడ్డి, స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బారాయుడు, సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యంలో అనస్థీషియాకు ఎంతో ప్రాధాన్యం


మాట్లాడుతున్న కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ రమాదేవి

కడప అర్బన్ : ఆధునిక వైద్య శాస్త్రంలో అనస్థీషియా విభాగానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ విభాగంకు ఎంతో ఆదరణ లభిస్తోందని కడప ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్) సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి అన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 16న ప్రపంచ అనస్థీషియా డేను కడప రిమ్స్‌లో ఘనంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో సోమవారం కడప ప్రభుత్వ సర్వజన వైద్యశాల (రిమ్స్)లోని సెంట్రల్ ఆపరేషన్ థియేటర్‌లోని మీటింగ్ హాల్‌లో అనస్థీషియా హెచ్ఓడీ డాక్టర్ సునీల్ చిరువెళ్ల పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో ప్రతిభ కనపర్చిన పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ ఎస్ మౌనిక, డాక్టర్ సంధ్యారాణిలచేత ముఖ్య అతిథులైన కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ, సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మిలతోపాటు వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి కేక్ కట్ చేయించారు. అందరికీ అందజేసి, ఆనందం పంచుకున్నారు. అనస్థీషియా విభాగం వైద్యులు, సిబ్బందితోపాటు హౌస్ సర్జన్‌లు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.